సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 12 । అక్టోబర్ । 2023

## 'కిట్టి' బతుకమ్మ సంబరాలు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని శ్రీలలితాదేవీ పద్మశాలి మహిళా కిట్టి పార్టీ గ్రూప్ సభ్యులు బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. జాతీయ చేనేత ఐక్య వేదిక అధ్యక్షురాలు గుజ్జె తార, పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కాముని వనిత, మున్సిపల్ కౌన్సిలర్ పత్తిపాక పద్మ, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ సారథ్యంలో సుమారు 50 మంది మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.



## న్యూస్‌రీల్

### ఇష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ

సిరిసిల్లటౌన్: విద్యార్థినిలు ఇష్టపడి చదివి..జీవితంలో ఉన్నతంగా రాణించాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలిక, మహిళా రక్షణ చట్టాలపై వివరించారు. అనంతరం బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ జి.వనజాకుమారి, డీఐఈవో మోహన్, న్యాయవిజ్ఞాన సమితి సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సైకిళ్లతో హాజరుశాతం పెంపు



సిరిసిల్లలో బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న డీఈవో, డీపీఆర్వోలు

సిరిసిల్ల: స్కూల్‌కు వెళ్లే బాలికల హాజరుశాతం పెంచేందుకు సైకిళ్లు దోహదపడతాయని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 20 మంది బాలికలకు పూర్వవిద్యార్థుల సహకారంతో సైకిళ్లను పంపిణీ చేశారు. డీపీఆర్వో మామిండ్ల దశరథం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి స్కూల్‌కు వచ్చే అమ్మాయిలకు సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తాను కూడా ఇదే పాఠశాల పూర్వ విద్యార్థిని అని గుర్తు చేసుకున్నారు. హెచ్‌ఎం డాక్టర్ చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు బైరి రవీందర్, వనజ, చిన్నమనేని రాజు, తూముల తిరుపతి, వడాల రవీందర్, శకుంతల, సుధాకర్‌రెడ్డి, పీఈటీ ఎల్.డేవిడ్సన్, సీఆర్‌పీ దేవేందర్ పాల్గొన్నారు.

### బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

రుద్రంగి(వేములవాడ): బాలికలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రుద్రంగి మండలం మానాల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. భవిష్యత్‌లో వచ్చే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అదనపు సీడీపీవో సుచరిత, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, డీ హబ్ కో–ఆర్డినేటర్ రోజా, సోషల్‌వర్కర్ విజయ్, చైల్డ్‌లైన్ సిబ్బంది వంశీ పాల్గొన్నారు.

### కోడ్ వచ్చే.. ముసుగు తొడిగే



విగ్రహాలకు ముసుగులు తొడుగుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది

చందుర్తి(వేములవాడ): రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా బుధవారం చందుర్తిలోని జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఫ్లెక్సీలు తొలగించడంతోపాటు వాల్‌రైటింగ్‌లను చెరిపివేశారు.

# గేరు మార్చిన కారు

- ప్రగతిభవన్‌కు రావాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు పిలుపు
- 15న అభ్యర్థులకు బీ ఫాంలు అందజేత
- అదేరోజు హుస్నాబాద్ నుంచి సీఎం ఎన్నికల ప్రచారం ప్రారంభం
- ఆదివారం నుంచి గులాబీ పార్టీ ప్రచారం ముమ్మరం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు కోడ్ రావడంతో కారు పార్టీ గేరు మార్చింది. నెలరోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థులను ఊహించని అయోమయంలో పడేసిన సీఎం కేసీఆర్.. తాజాగా మరో ముందడుగు వేస్తున్నారు. ఈనెల 15న అభ్యర్థులకు బీఫారాలు అందించనున్నారు. అదేరోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అది కూడా ఆయనకు సెంటిమెంట్‌పరంగా కలిసి వచ్చిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కావడం విశేషం. 15న ఉదయం సిట్టింగులు, కొత్త అభ్యర్థులకు బీ ఫారాలు అందించిన అనంతరం హుస్నాబాద్‌లో జరిగే సభకు హాజరవుతారని సమాచారం. సెప్టెంబరులోనే అభ్యర్థులను ప్రకటించడంతో ఆశావహులంతా వారివారి నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ పనుల ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు శంకుస్థాపనల కార్యక్రమాన్ని వేదికగా చేసుకుని అభివృద్ధి చూసి తమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని, విపక్షాలకు అవకాశం ఇవ్వవద్దని కోరుతున్నారు.

**అమావాస్య మరునాడు..**

ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఇదే అదనుగా గతంలో గెలిచిన సీట్ల కంటే అధిక సీట్లు గెలవాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్న కారు పార్టీ ఆదివారం నుంచి ప్రచారాన్ని హోరెత్తించనుంది. శనివారంతో అమావాస్య ముగియనుంది. మరుసటి రోజు నుంచి మరింత ముమ్మరం చేయాలన్న ప్రణాళికతో ముందుకుసాగుతోంది. ఇందులో భాగంగానే హుస్నాబాద్ సభకు జనసమీకరణ కోసం ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ అభ్యర్థులు ఉదయాన్నే బీ ఫారాలు అందుకుని వెంటనే తిరిగి రావాల్సి ఉంటుంది.

**వీరికి బీ ఫాంలు..**

ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్ రెడ్డి, వొడితెల సతీశ్‌బాబు, కోరుకంటి చందర్, డాక్టర్ సంజయ్ కుమార్, సుంకె రవిశంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, కొత్తగా పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, చలిమెడ లక్ష్మీ నరసింహారావుకు బీ ఫాంలు అందనున్నాయి.

**క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..**

ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. క్లీన్‌స్వీప్ చేయాలని భావించిన ప్రతిసారీ కారుపార్టీకి నిరాశే మిగులుతోంది. 2014లో బీఆర్‌ఎస్ 12 స్థానాలు గెలుచుకుంది. 2018లో 11 స్థానాలు గెలవగా.. ఏఐఎఫ్‌బీ నుంచి గెలిచిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో ఎమ్మెల్యేల సంఖ్య తిరిగి 12కు చేరుకుంది. 2018లో ఈటల రాజేందర్ పార్టీకి రాజీనామా చేయడంతో మళ్లీ 11కు పడిపోయింది. ఈ క్రమంలో ఈసారి ఎలాగైనా 13 స్థానాల్లో పాగా వేయాలన్న పట్టుదలలో ఉంది గులాబీ పార్టీ. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ ఈనెల 15న హుస్నాబాద్, 17న సిరిసిల్ల, నవంబరు 3న కోరుట్ల, 7న మంథని, పెద్దపల్లిలో భారీ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఈ సభలను నిర్వహించడం ఆయా నియోజకవర్గ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

# బహిరంగ సభకు ప్రతీ ఊరు కదలాలి



ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్ జిల్లా నేతలతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- 17న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి
- 16న బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్ ప్రారంభం
- జిల్లా బీఆర్‌ఎస్ శ్రేణులతో మంత్రి కేటీఆర్
- హైదరాబాద్‌లో సమావేశం

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు ప్రతి ఇల్లు, ప్రతి ఊరు కదిలిరావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ 17న సిరిసిల్లలో బహిరంగ సభ ఉంటుందని, సీఎం కేసీఆర్ పాల్గొనే ఈ సభకు భారీగా జనాన్ని సమీకరించాలని సూచించారు. అంతకుముందు 16న పార్టీ సెక్రటరీ జనరల్ కేశవరావు చేతుల మీదుగా బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. సబ్బండ వర్గాలను ఆదుకున్న సీఎం కేసీఆర్ సభకు అన్ని వర్గాల ప్రజలు కలిసి వచ్చేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఎస్‌టీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఏఎంసీ చైర్మన్ పూసపల్లి సరస్వతి, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్లలో చైతన్యం నింపాలి

- డీపీఆర్వో దశరథం

సిరిసిల్ల: ఓటుహక్కును అందరూ వినియోగించుకునేలా చైతన్యం నింపాలని డీపీఆర్వో మామిండ్ల దశరథం కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథులతో సమావేశమయ్యారు. దశరథం మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుబడి క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ఓటర్లలో చైతన్యం నింపేందుకు కళాప్రదర్శనలు చేయాలన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలని కోరారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు వివరించాలని దశరథం కోరారు.



కలెక్టరేట్‌లో కళాకారులతో మాట్లాడుతున్న డీపీఆర్వో దశరథం

# అక్రమాలపై సి–విజిల్ వేయండి

- కోడ్ ఉల్లంఘనలపై టెక్నాలజీ సహాయంతో నిఘా
- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి




సి–విజిల్ యాప్



అనురాగ్ జయంతి, జిల్లా ఎన్నికల అధికారి

సిరిసిల్ల: ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలు, సి–విజిల్ యాప్ అమలు తీరుపై బుధవారం వివరించారు. ఎన్నికల వేళ జరిగే అక్రమాలను పౌరులు ఎప్పటికప్పుడు సీ–విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చని, ఎవరైనా ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘిస్తే, దానికి సంబంధించిన దానిని ఈ యాప్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల అనుచరులు డబ్బులు, మద్యం, బహుమతుల వంటివి పంపిణీ చేస్తే.. నేరుగా 'సి–విజిల్' యాప్‌తో ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ వివరించారు. లౌడ్‌స్పీకర్లు, మతాలు, కులాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పర్మిషన్ లేకుండా ఎన్నికల ర్యాలీలు నిర్వహించినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని స్పష్టం చేశారు. ఈ యాప్‌ను ఇప్పటికే పది లక్షల మంది పౌరులు డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. ఈ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై పది నిమిషాల వ్యవధిలోనే సంబంధిత అధికారులు అక్కడికొచ్చి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ చర్యల ద్వారా ప్రజల్లో, వ్యవస్థపై నమ్మకం పెంచుతుందని, జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. సీ–విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులను ఎన్నికల సంఘం వెంటనే పరిశీలిస్తుందని, వంద నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్‌నంబర్లను ఈసీ గోప్యంగా ఉంచుతుందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే విధానంపై ప్రజలకు, అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తుందని, సీ–విజిల్ యాప్‌తోపాటు 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ వివరించారు.

# బీఆర్‌ఎస్‌లో గ్రూపుల్లేవ్

- భవిష్యత్‌లో మనోహర్‌రెడ్డికి సముచిత స్థానం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: బీఆర్‌ఎస్‌లో గ్రూపులు లేవని, తమదంతా ఒకే కుటుంబమని.. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయడమే తమ లక్ష్యమని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. ఏనుగు మనోహర్‌రెడ్డి నివాసంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రమ్‌పాషా ఆధ్వర్యంలో చల్మెడను కలసి మద్దతు ప్రకటించారు. లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మనోహర్‌రెడ్డికి సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఏనుగు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిషలు కృషి చేస్తామన్నారు.

# టూరిస్టులకు అవకాశమివ్వకండి

- నేను మీ మనిషిని.. నన్ను ఆదరించండి
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



కాంగ్రెస్ గ్యారంటీ స్కీమ్‌లు వివరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తామంటూ టూరిస్టులు వచ్చిపోతుంటారు... కానీ నేను మీవాడిని, మీలో ఒకడిగా పెరిగిన వాడిని.. ఆదరించండంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. స్థానిక సుభాష్‌నగర్, ఉప్పుగడ్డకాలనీల్లో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. తనను ఓడించేందుకు బీఆర్‌ఎస్ నాయకులు డబ్బు సంచులతో వస్తున్నారని.. అలాంటి వారిని నమ్మి మళ్లీ మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చేందుకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు చిలుక రమేశ్, సంగ స్వామి, కూరగాయల కొమురయ్య, మధు, కనికరపు రాకేశ్, నాగుల విష్ణు, సగ్గు పద్మ, తోట లహరి, నూగురి లక్ష్మి, దేవయ్య, గణేశ్, సాబీర్, కిరణ్, మల్లేశం, గణేశ్, షేక్ ఫిరోజ్ పాల్గొన్నారు.

# చేరికలపై నజర్

- యువతరం, కుల సంఘాలకు ఎర
- ఊపందుకున్న రాజకీయ వేడి
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- కొలిక్కిరాని బీజేపీ టికెట్ వ్యవహారం

వేములవాడ: ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో వేములవాడ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రాజుకుంది. ముందు నుంచే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేరును సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఆయన ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. పార్టీ నాయకులు, ప్రజల నుంచి మద్దతు కోరుతూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఆది శ్రీనివాస్ నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ఈసారి తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ బీజేపీ అభ్యర్థి ఎవరో ఇప్పటి వరకు ప్రకటించలేదు.

**పార్టీ ఫిరాయింపులు... చేరికలు**

ఎన్నికల తేదీలు ప్రకటించడంతో ఆయా పార్టీలు, పార్టీల్లోనే నేతలు పార్టీ ఫిరాయింపులు, చేరికలపై ప్రత్యేక నజర్ వేస్తున్నాయి. ఇందుకు కుల సంఘాలు, యువతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ప్రముఖులు, కొంత మంది ప్రజాప్రతినిధులు తమతమ బలగంతో పార్టీలు మారేశారు. బీజేపీ నుంచి ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీటీసీ సువర్ణ స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు గోపు బాలరాజులు కారెక్కారు. కాంగ్రెస్ నుంచి వీడిపోయి తటస్థంగా ఉన్న మాజీ ఉపసర్పంచ్ గన్నమనేని రామారావు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇక కాంగ్రెస్ పార్టీలోకి సైతం వలసలు పెరిగాయని చెప్పొచ్చు. బీజేపీ అభ్యర్థి ప్రకటించడం, నామినేషన్ల పర్వం ప్రారంభమయ్యే నాటికి ఇంకెంతమంది పార్టీలు మారుతారోనన్న చర్చ జోరందుకుంది. ఈ పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు ఆశావహులు టికెట్ ఆశిస్తున్నారు.

**కులసంఘాలు... యువతకు ఎర**

నియోజకవర్గంలోని ప్రధాన కులాలు, కులసంఘాలు, యువతరంపై ఆయా పార్టీలు దృష్టి పెట్టాయి. యువతకు స్పోర్ట్స్ కిట్లు, కులసంఘాలకు స్థలాలు, నిధుల కేటాయింపు అంశాలపై ప్రధానంగా చర్చ సాగుతోంది. కులపెద్దలు, యువత పెద్ద ఎత్తున పార్టీ ముఖ్యుల వద్దకు క్యూ కడుతున్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద ఇప్పటికే జాతర వాతావరణం నెలకొంది.

## రాజన్న సేవలో ఎన్పీడీసీఎల్ ఎండీ

వేములవాడ: రాజన్నను టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎండీ అన్నమనేని గోపాల్‌రావు కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అద్దాల మండపంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు కండువా కప్పి ప్రసాదాలు అందజేశారు. ఎన్పీడీసీఎల్ డీఈ రాజం, డీఈ ప్రదీప్, ఏడీఈ శ్రీనివాస్, కరీంనగర్ ఎస్ఈ గంగాధర్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆలయ ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్ ఉన్నారు.




## ధాన్యం అమ్ముకునేందుకు..



ముస్తాబాద్(సిరిసిల్ల): అమ్మబోతే అడివి..కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది అన్నదాతల పరిస్థితి. ముస్తాబాద్ మండలంలో వరికోతలు మొదలుకాగానే ధాన్యం విక్రయాలకు రైతులు సంసిద్ధమవుతున్నారు. ప్రభుత్వం అందించే మద్దతు ధర కాదని క్వింటాల్‌కు రూ.1850కే విక్రయిస్తున్నారు. ఆవునూర్, గూడెం గ్రామానికి చెందిన వందలాది ట్రాక్టర్లు ధాన్యంతో ముస్తాబాద్ మండలంలోని ఓ రైస్‌మిల్లు వద్ద బుధవారం బారులుతీరాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు మరో నెలరోజులైన ప్రారంభం కావని అక్కడున్న రైతులు పేర్కొంటున్నారు. తేమ, తరుగు, పెల్ల, జాలీ పట్టడం వంటి అంక్షలు లేకుండానే పొలం నుంచి నేరుగా మిల్లుకు తరలించామని ఆవునూర్ రైతులు పేర్కొన్నారు. ఇక్కడ కూడా గంటల తరబడి ఎదురుచూస్తున్నామన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు లాభం కలుగుతుంది.

## క్లుప్తంగా

### బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా దేవేందర్‌యాదవ్



నియామకపత్రం అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌కు చెందిన కొక్కు దేవేందర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

### సీఎం సభను విజయవంతం చేయాలి



మహిళలకు బొట్టు పెట్టి ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ

గంభీరావుపేట(సిరిసిల్ల): సిరిసిల్లలో ఈనెల 17న నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్‌ఎస్ నాయకులు మండలంలో గోరింటాలలో ఇంటింటి ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి సభకు రావాలని కోరారు. మంత్రి కేటీఆర్‌ను మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకొని సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. సర్పంచ్ కొలుముల అంజమ్మ, ఎంపీటీసీ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు సురేందర్, లక్ష్మణ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తారని ఆశిస్తున్నామని రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ ఒగ్గు బాలరాజుయాదవ్ పేర్కొన్నారు. ఈనెల 17న ముఖ్యమంత్రి కేసీఆర్ సిరిసిల్లకు రానుండడంతో ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చుతూ ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

### దుర్గాదేవి మండపానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని శ్రీపరమేశ్వరీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం మండపం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ పడిగెల మానస, ఉపసర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పెద్దూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్
- రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల/వేములవాడఅర్బన్: పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని సిరిసిల్ల ఆర్డీవో, ఓటరు నమోదు అధికారి ఎస్.ఆనంద్‌కుమార్ కోరారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాను అన్ని పార్టీల నేతలకు అందించారు. పురుషులు, మహిళల ఓటర్ల నిష్పత్తిని, 18–19 ఏళ్ల యువతీ, యువకుల ఓటర్ల సమాచారాన్ని అందించారు. ఆర్డీవో మాట్లాడుతూ తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల నేతలు ఓటర్ల జాబితాను పరిశీలించాలని సూచించారు. అరుకాల రమేశ్(బీఎస్పీ), ఎన్.శ్రీనివాస్ (బీజేపీ), అన్నల్‌దాస్ భాను(కాంగ్రెస్), గజభీంకార్ రాజన్న(బీఆర్‌ఎస్), తీగల శేఖర్‌గౌడ్(టీడీపీ), ఎస్.నాగరాజు(సీపీఐ), వై.రాజశేఖర్(సీపీఐ–ఎం), మహమ్మద్ మైముద్దీన్(ఏఐఎంఐఎం), కరుణాకర్(వైఎస్‌ఆర్‌సీపీ), మేకల కమలాకర్(ఏఐఎఫ్‌బీ) తదితరులు పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి**

ఎన్నికల నిర్వహణకు పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీవో మధుసూదన్ కోరారు. తన కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా వివరాలను ఆయా పార్టీల నాయకులకు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గ పరిధిలో 2,18,160 మంది ఓటర్లుగా నమోదైనట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌బృందాలు, మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి స్టాటిక్ సర్విలైన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ మహేశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# తనిఖీల తర్వాతనే అనుమతులు



ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, తహసీల్దార్ సుజాత, పోలీస్ అధికారులు బుధవారం పరిశీలించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా, జగిత్యాల జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ఏ వాహనం వచ్చినా పూర్తిగా పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. 24 గంటలు మూడు షిఫ్టులు సిబ్బంది విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ సుజాత, ఎస్సై మారుతి, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు.

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలకేంద్రంలో స్పెషల్‌స్క్వాడ్ టీమ్ శ్రీనివాస్ నేతృత్వంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున మండలంలో ఎలాంటి మద్యం, డబ్బు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలన్నారు. ఏఎస్సై శ్రీను, కొమురయ్య, రియాజ్ పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి నిరసన



వాటర్ ట్యాంక్ ఎక్కిన శోభన్

కోనరావుపేట(వేములవాడ): రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు తాను ఇబ్బందులు పడుతున్నానంటూ ఓ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాలు. మండలంలోని నిజామాబాద్‌కు చెందిన ట్రాక్టర్ యజమాని శోభన్ రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతితో ఇసుక రవాణా చేస్తున్నాడు. పోలీసులు ట్రాక్టర్‌ను ఆపి పరిశీలించగా.. తప్పుడు పత్రాలతో ఇసుక రవాణా చేస్తున్నారంటూ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతితోనే తాను ఇసుక రవాణా చేస్తున్నానని యువకుడు చెప్పినా పోలీసులు వినలేదు. దీంతో సదరు యువకుడు కోనరావుపేట కేడీసీసీ బ్యాంక్ పక్కన గల వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. తనను పోలీసులు కావాలని వేధిస్తున్నారని, రెవెన్యూ అధికారులు చేసిన తప్పుకు తనను బలిచేస్తున్నారని ఆరోపించాడు. తన ట్రాక్టర్ విడిచిపెట్టాలని డిమాండ్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో యువకుడు దిగి వచ్చాడు.

# ఆదర్శప్రాయుడు జ్యోతిబాపూలే

- ఆవునూర్‌లో పూలే విగ్రహావిష్కరణ



పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సంఘ సంస్కర్త జ్యోతిబాపూలే అందరికీ ఆదర్శప్రాయుడని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రణవేని లక్ష్మణ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ చదువు విలువ తెలిపి.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప వీరుడు పూలే అని పేర్కొన్నారు. సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ లలిత, జెడ్పీటీసీ నర్సయ్య, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పిట్ల రాంగోపాల్, పిట్టల భూమేశ్, బొజ్జ కనకయ్య, గజ్జెల రాజు, పిట్ల చంద్రయ్య, బాబు, రేగుల దేవరాజు, భానుచందర్, గిరి, పిట్ల నారాయణ, సుద్దాల శ్రీనివాస్, బోయిని కృష్ణస్వామి పాల్గొన్నారు.

### బెల్టుషాపులపై కొరడా



సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ కొరడా ఝులిపించారు. ఈమేరకు బుధవారం పోలీస్ సిబ్బందితో మండలంలోని రేపాకలో రెండు కిరాణ షాపుల్లో దాడులు చేసి 15 బీర్ బాటిళ్లు, మూడు లీటర్ల మద్యం, మరొకరి నుంచి 38 బీర్‌బాటిళ్లు ఆరున్నర లీటర్ల మద్యం సీజ్ చేసి, కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం విక్రయిస్తున్న దయాసాగర్, హరీశ్‌లను బైండోవర్ చేశారు.

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని గుండన్నపల్లిలోని బెల్ట్‌షాపులపై బుధవారం పోలీసులు దాడి చేసి రూ.15 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు



పట్టుబడిన మద్యం సీసాలు

వేములవాడరూరల్: గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ రూరల్ ఎస్సై మారుతి హెచ్చరించారు. వేములవాడ మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన గడ్డం పర్శరాములు ఇంట్లో తనిఖీ చేయగా 7 వేల విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

### బెల్టుషాపులపై పోలీసుల దాడులు

- రూ.20వేల మద్యం స్వాధీనం

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేట, సనుగుల గ్రామాల్లోని బెల్టుషాపులపై ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడులు చేశారు. రూ.20వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలకు, ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే బెల్టుషాపు నిర్వాహకులను బైండోవర్ చేశామన్నారు. గ్రామాల్లో మద్యం విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వివాదాస్పదులుగా పోలీసు రికార్డుల్లో ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రూ.21వేల మద్యం పట్టివేత

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విలీన గ్రామాలతో పట్టణంలో పలు ఏరియాల్లో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై సిరిసిల్లటౌన్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. కిరాణం, హోటల్స్ చాటున జరుగుతున్న మద్యం విక్రయాల నిర్వాహకుల నుంచి దాదాపు రూ.21వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. ఎస్సై ప్రేమానందం దాడులు చేసి మద్యం పట్టుకున్నారు. సంపంగి లక్ష్మి, సంపంగి మల్లవ్వలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### మంత్రి కేటీఆర్‌ను కలిసిన జిల్లా పద్మశాలి సంఘం నాయకులు



మంత్రి కేటీఆర్‌ను కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

సిరిసిల్ల: జిల్లా పద్మశాలి సంఘం నాయకులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావును బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కలిశారు. జిల్లాకేంద్రంలో పద్మశాలి భవన్ నిర్మాణంపై చర్చించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, ప్రధాన కార్యదర్శి దిడ్డి రాజు, కార్యదర్శి రిక్కుమల్లె సంపత్, సిరిసిల్ల పట్టణ సంఘం నాయకులు మండల సత్యం, డాక్టర్ గాజుల బాలయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, వస్త్రవ్యాపారులు తాటిపాముల దామోదర్, గౌడ రాజు, అడ్డగట్ల మురళి, చేరాల శ్రీనివాస్, ఏనుగుల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

# లబ్ధిదారులం కాదు.. హక్కుదారులం



సమావేశమైన బీఆర్‌ఎస్ దళిత నాయకులు

వేములవాడరూరల్: తమను కొంత మంది దళితులు దళితబంధు కోసమే పనిచేస్తున్నారని, పార్టీ కోసం చేయడం లేదని అనడం సరికాదని బీఆర్‌ఎస్ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నామని, ఏ రోజు కూడా పదవుల కోసం, పథకాల కోసం ఆశించలేదని స్పష్టం చేశారు. వేములవాడ రూరల్ మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ దళిత నాయకులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల వేములవాడ రూరల్ మండల బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ అందులో దళితులకు అవకాశం కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పథకాల కోసం దళితులు పనిచేయడం లేదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికైనా గుర్తించాలని కోరారు.

### ఐలమ్మ విగ్రహావిష్కరణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని బుధవారం రాష్ట్ర రజకసంఘం అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, మండలాధ్యక్షుడు కంచర్ల నర్సింహులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు పెద్దూరి కిష్టయ్య, పిల్లి కిషన్, ఎడపల్లి భూపతి పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

# ప్రజా అవసరాల కోసమే ఇసుక రీచ్

- తహసీల్దార్ సుజాత



మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

వేములవాడరూరల్: ప్రజల అవసరాల కోసమే జిల్లా అధికారుల అనుమతితో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తున్నామని వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వేములవాడరూరల్ మండలం లింగంపల్లి, బొల్లారం గ్రామాల మధ్య మూలవాగుపై ఇసుకరీచ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి అనుమతులతో వినియోగదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. వ్యాపారాలకు అనుమతులు ఇవ్వడం లేదని, గృహ యజమానులకు మాత్రమే తప్పని పరిస్థితుల్లో ఇసుక అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని జిల్లా మైనింగ్ అధికారులు పరిశీలించి ఇక్కడ 36 వేల క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. రూరల్ గ్రామాల ప్రజలు రెవెన్యూ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకుని మాత్రమే ఇసుకను తరలించాలని, అనుమతులు లేకుండా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



కళాశాలలో విద్యార్థుల నృత్యాలు

- అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి





మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

వేములవాడఅర్బన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, అత్యున్నత స్థాయిలో స్థిరపడేందుకు కృషిచేయాలని అడిషనల్ కలెక్టర్ బి.గౌతమ్‌రెడ్డి కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నోవాటో ఫీస్ట్ పేరుతో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఎన్వీ శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ పోటీప్రపంచంలో నైపుణ్యం, పరిజ్ఞానం గల డిగ్రీ విద్యార్థులకు సైతం మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వసతులతో కూడిన ఘన చరిత్ర గల ఏకైక కళాశాల అని, వసతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్, మధు రాజేశ్, మల్లారెడ్డి, అఫ్సారీ ఉస్మాని, రమాదేవి, రాజేశ్, ప్రభాకర్, శ్రీనివాసులు, అంజద్ అలీ, నారాయణ, నర్సయ్య, కరుణ, మధుబాబు, దీపిక, అర్జున్ ఉన్నారు.

# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

- ఎంపీపీ జనగామ శరత్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. ముస్తాబాద్‌లో ఎంపీపీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. శరత్‌రావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు వంటి పథకాలను అందిస్తున్న విషయాన్ని వివరించాలని కోరారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, విజయరామారావు, జానబాయి, మట్టరాణి, రేణుక పాల్గొన్నారు.

# చెట్టును నరికిన వ్యక్తికి జరిమానా



శంకర్‌కు జరిమానా విధిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకొని రాజన్నపేటకు చెందిన శంకర్ బిల్డింగ్ కాంప్లెక్స్ నిర్మించాడు. తన ఇంటి ముందు ఉన్న చెట్టు మొదలును బుధవారం నరికాడు. ఈ విషయమై శంకర్‌ను వివరణ కోరగా పదిహేను రోజుల క్రితం గ్రామపంచాయతీ సిబ్బంది కొమ్మలను కొట్టివేయడంతో మొదలు మాత్రమే మిగిలిందని, దాన్ని తొలగించినట్లు చెప్పారు. గతంలోనూ హరితహారం మొక్కను నరికివేసిన శంకర్‌కు పంచాయతీ కార్యదర్శి జరిమానా విధించిన విషయం తెలిసిందే. రెండోసారి చెట్టును నరికిన భవన యజమాని శంకర్‌కు గ్రామపంచాయతీ అధికారులు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఇప్పటి వరకు ఎల్లారెడ్డిపేటలో ఐదుగురికి జరిమానాలు విధించినట్లు కార్యదర్శి దేవరాజు తెలిపారు.

# 'బీఆర్‌ఎస్‌కే మా ఓటు'



తీర్మానపత్రం ఇస్తున్న పదిర గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికల్లో తాము బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తామని మండలంలోని పదిర గ్రామంలోని ఎస్సీకాలనీవాసులు తీర్మానించారు. మంత్రి కేటీఆర్‌కు ఓటు వేస్తామని శపథం చేశారు. ఈమేరకు తీర్మానపత్రాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరికి అందజేశారు. పార్టీ గ్రామాధ్యక్షుడు కుంబాల లక్ష్మారెడ్డి, తెడ్డు దేవరాజు, సుధమల్ల సురేందర్, తెడ్డు భూమరాజయ్య, తెడ్డు పరశురాములు, రుద్రారపు చంద్రయ్య, సతీశ్, కిట్టు, బాబు, నర్సింలు, రాజు, మధు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీలకు దారి విషయంలో డీపీవో విచారణ

- దారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రానైట్ ఫ్యాక్టరీలు



దారి విషయంలో క్షేత్రస్థాయిలో డీపీవో రవీందర్, ఇతర అధికారుల విచారణ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్ పరిసరాల నుంచి ఫ్యాక్టరీలకు వెళ్లే దారి విషయంలో వచ్చిన ఫిర్యాదులపై డీపీవో రవీందర్, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, మిడ్‌మానేరు డీఈ అప్పన్నగారి శ్రీనివాస్‌తో కలిసి బుధవారం విచారణ చేపట్టారు. స్థానికంగా ఉన్న ఓ పెట్రోల్‌బంక్ పరిసరాల పక్కకు గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఫ్యాక్టరీలకు వెళ్లే దారి ఇరిగేషన్ ఆధీనంలో ఉందని గతేడాది సదరు అధికారులు కందకం తీసిదారి మూసేశారు. ఫ్యాక్టరీ యజమానులు కోర్టును ఆశ్రయించి స్టే తేవడంతో కందకం పూడ్చి దారిని పునరుద్ధరించారు. ఫ్యాక్టరీలకు వెళ్లే దారి పరిసరాల్లో నీలోజిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సంపదవనం ఏర్పాటు చేశారు. సంపదవనం చుట్టూ కంచె పెట్టి గేటు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఫ్యాక్టరీల యజమానులు తమ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది ఏర్పడిందని కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో అధికారులు విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రానైట్ ఫ్యాక్టరీల వారు ఇరిగేషన్ భూములు ఆక్రమించారని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో ఫ్యాక్టరీల వారు నిర్మించిన రెండు గదులను తొలగించాలని అధికారులు ఆదేశించారు. కోర్టు కేసు తేలే వరకు ఫ్యాక్టరీలకు వెళ్లేందుకు బ్లాక్ చేయకుండా దారి ఇవ్వాలని అధికారులు చెప్పారు. పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా గేటు పెద్దగా పెట్టాలన్నారు. మొత్తానికి దారి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.